చేది. మేం చెయ్యాలని చేసేవాళ్ళం కాదు— అసలు ఆయన క్లాసులో ఊపిరి తీసుకుందుకుకూడా మాకు ధైర్యం చాలేదికాదు. అలాంటప్పుడు ఇంక చెయ్యాలని చెయ్యటమేమిటి?—నే నొక మాటు ఆయన పాఠం చెప్తుంటే ప్రక్క అమ్మాయితో మాట్లాడాను. ఆయన కప్పుడు వచ్చిన కోపం ఇంతాఅంతా కాదు. "ఎవరది?" అని సింహంలా గర్జించారు. క్లాసంతా గజగజ లాడి పోయింది. ఆయన కళ్ళు చింతనిప్పులయినాయి. ముఖం కందగడ్డలాగైంది. ఆ చూపులో క్లాసులో అందరినీ ఒక్కసారి నమిలి మింగేసేటంతటి తీక్ష్ణత ఉంది. ఆయన్ని చూస్తే దుశ్శాసనుని రొమ్ము చీల్చి రక్తం త్రాగుతానని సభలో ప్రతిజ్ఞ చేస్తున్న భీముడు జ్ఞప్తికొచ్చాడు. ఇదంతా "ఎవరది?" అన్న కేకతోనే వచ్చిందంటే తరువాతి విషయం వేరే చెప్పాలా?...ఆడపిల్లననేనా ఆలోచించక నన్ను నానామాటలు అన్నాడు. ఆ ఏటికి పరీక్ష తప్పినట్టే నన్నాడు. అంత శ్రద్ధలేనప్పుడు చదువు మొదలెట్టకుండా ఉండవలసిందన్నాడు. మా నాన్నతో చెప్పి తగిన కట్టుదిట్టం చేస్తానన్నాడు. ఇలా ఇంకా ఎన్నో...అవన్నీ ఇప్పటికి—నలభై ఏళ్ళ తరువాత కూడా—జ్ఞాపక మున్నాయంటే దాన్నిబట్టి ఊహించవచ్చు ఆయన కెంతకోపం వచ్చిందో నేను చాలా కంగారుపడ్డాను. ఆయన దృష్టిలోపడ్డాక ఆయన మూడవకన్ను తెరవకనూ మానడు. నేను భస్మంకాకనూ తప్పదని నిశ్చయమయింది. అందరూ అలాగే అనుకున్నారు. కాని ఆయన ఏమీ అపకారం చెయ్యలేదు. పైగా మా నాన్నతోను, హెడ్మాష్టారితోను నన్ను గురించి ఎంతోమంచిగా చెప్పాడట. కనుక అప్పటికి కొంచెం కష్టం కలిగించినా వీళ్ళేమెరుగని నా అభిప్రాయం" అంది శారద.

భద్రమ్మగారు ఇంక వప్పుకోక తప్పలేదు. "నిజమేనమ్మా! కాని వాళ్ళ మనస్సుకి తగినట్టు కొంచెం మాటకూడా మార్చుకుంటే బాగుండదూ? చెప్పు!" అంది.

---

స్కెచ్

# వాన తలపులు

కాలజ్ఞానం రామారావు

రాత్రి రేడియోలోని వాతావరణం సూచన అక్షరాలా నిజంచేస్తూ రాత్రే ప్రారంభమైన వాన పొద్దున్ననగా సూర్యుని కించపరుస్తూ ఆకాశం మొహానికి మసిపూసి భూదేవిని ముంచేస్తూంది. సాకు దొరికితే చాలని మాచే నాకు యిదో పెద్దకారణమై, యింట్లో గొడుగు లేదన్న కారణంతో కలిసి ఆఫీసుకు పోకుండా చేసాయి. తొమ్మిదికే ఆఫీసుకు కదలాల్సిలనవాణ్ణి పదిగంటలకు స్నానంచేసి పాన్నర భోజనం ముగించాను. బడిలేదని యింట్లో పిల్లలూ నిల్చిపోయారు. రెండురోజులుముందు కడుపు నొప్పితో బాధపడ్డ సోదరుడు యిప్పటికి బాగా కోలుకున్నాడు. వీళ్ళ గడిబిడల మధ్య రోజు గడవాలి. నేనుచేయబోయే ప్రతిపనిలో వాళ్ళు ఓచేయి పెట్టడానికి తయారవుతారు. రోజేలాగ గడవాలి? ఆఫీసులోనయితే ఈ వానదెబ్బకు కేన్టిన్ అయ్యర్ ధర్మమా అని అక్కౌంటులో వ్రాసి గంటగంటకూ వేడి టీ పుచ్చుకునే వాడిని. మరి యిండ్లో నడవదుగా. మాట్లాడితే అమ్మ కాఫీయే మానేయమంటుంది. "ఇప్పట్నించే పొదుపు నేర్చుకోకపోతే రేపు పెండ్లిపెడాకులై నాక యేంచేస్తావురా" అని కసురుకుంది మాతృమూర్తి. అబ్బా, భార్యారత్నమన్నారు. ఆ రత్నమైనా ఒకటి ముశిపడితే యీ కష్టమైనా తప్పేది కదా అనుకుంటాను. వెధవ వాన చంపేస్తోంది. చినుకులు నిముషమైనా ఆగిన పాపానపోలేదు. ఏంచేయాలి?

ముందురోజు మహాలాయ అమావాస్యట. ఈ రోజు పేపర్ లేదు. ఛీ యీ పండుగలూ పబ్బాలూ ఎందుకొస్తాయో యిల్లాంటివేళల్లో. పోనీ నిన్ననే మహాలాయ అమావాస్య స్పెషల్ అని ఓ నలభై పేజీలపత్రిక ఇండిపెండెన్సుడే ఇష్యూలా వేసి

వుందరాదూ? సరేసరి అని ముందురోజు తెచ్చిన 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ' ముందేసుకుని కూర్చున్నా. కవర్‌పేజీ చాలా అట్రేక్టివ్‌గావుంది. ఫోటో తయారుచేసి గోడకు తగిలిస్తేనో? ఇంకోసారికి పోస్ట్‌పోన్ అయింది ఆ ఊహ. ఇంకా పుస్తకం లోకి జొరబడ్డా. అబ్బోయ్, ఏభై వేలు గెలుచుకోండి! యాభై వేలే! దానికి ముందు సెంబర్‌లో ఏభై వేలు ఏడుమంది పంచుకున్నా రట - తలో 7142-14-0 చొప్పున. అదృష్ట వంతులు కుబేరునికి ప్రీతిపాత్రులు. రూపాయ యెంతచేసింది! ఒంటిగా వెళ్ళి 7141రూపాయలను లాక్కొచ్చింది! నాలో యేదో రోషం పుట్టు కొచ్చింది. ఛా, యిన్నిసార్లు ట్రైచేస్తున్నాం, అదృష్టంలే. కాని ట్రై అండ్ ట్రై అన్నారు అంటోంది హృదయం. అదీగాక మొన్న మొన్ననే అన్నయ్యకు ఒక తప్పుతో నాలుగువందలొచ్చా యట. అరెరె, యేదో కుటుంబానికి గ్రహాలు సుముఖంగా వుండేలావుంది అనిపించింది. కూపన్ తీసి కూర్చున్నా నింపడానికి. కాని ఇంకా టైముందని 26వ తారీఖని జ్ఞాపకమొచ్చింది. దాని మడచి పెట్టెలో పెట్టా ఫస్ట్‌దాకా రెస్ట్‌నిస్తూ. ముందు కార్యక్రమం?

గంట ఇంకా రెండు కాలేదు. "ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ"లోవున్న రెండుకథలూ రాత్రేఐపోయాయి. తెచ్చిన తెలుగు వారపత్రిక పూర్తిచేసేదాకా నిద్రపట్టదు గాబట్టి పొద్దున్నే ముగిసింది. మరేం చేయాలి? పేజీలుతిప్పుతూ కూర్చున్నా. 'ప్రేమలత' సగంలో నిలిచిపోయిన కథ. పూర్తిచేస్తేనో? యింకా, తిప్పారు, "అందాలరేయి," "ప్రేమ పదాలు" గేయాలు, యెప్పుడో యేవో హృదయం పొంగులలో గీసిన గీతాలు నవ్వాయి. వీటిని పూర్తిచేసి పత్రికకు పంపితేనో రుచించలేదు. సరేసరి, ఓ క్రొత్తకథ సృష్టిస్తే? మంచి ఆలోచన! ఓకప్పు వేడి టీ నోట్లో పోస్తే మెదడుకు మేతపడి కలంనడక జోరుగా సాగుతుంది. సాయంత్రం ఐదుకల్లా కలాన్ని ఓ పదిపేజీలు పరుగెత్తించి తర్వాత మూసిపెట్టి ఆవేళకు వాన నిలిచిపోతుంది కాబట్టి హాయిగా "హుసేన్‌సాగర్"వైపునకు గాలిమేతకు పోవచ్చని ప్లాన్‌వేసుకున్నాను. "అమ్మా, టీ నీళ్ళు కాచ" మని ఓ కేకపెట్టి సర్దుకుని కూర్చున్నాను, కథ వ్రాయను, కావలసిన సరంజం అంతా కూర్చు కోవాలి. పేపర్లు తీసిపెట్టుకున్నాను. కలం దింపాను "గ్లోబ్ ఇంక్"తో "ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ" ఒత్తుగా పెట్టుకొని ఓ కాలుచాచి, ఓ కాలుమడిచి కూర్చున్నా ప్రారంభ సూచకంగా, ఇంతలో మెదడు ప్రశ్నార్థకం పెట్టింది. "అబ్బాయ్, ఆగు. ఈ కాలంవాళ్ళకు అంతా "తొందరే!" అని. పెన్నుపట్టుకున్న చేయి గడ్డానికి ఆనుకుంది. తలపైకి లేచింది. "ఇంతకూ మీ కథ ప్లాట్ యేమిటో ఆలోచించారా?" ప్రశ్నించింది. దీపావళి దూరంగావుంది. అలాకాదు పెద్ద వాళ్ళకే ఓ కథ వ్రాయాలి. ఆలోచనలోపడ్డాను.

మెదడుసహాయ నిరాకరణోద్యమాన్ని లేవదీసింది. "ససేమిరాకదలన"ని ఛా. ఇంటర్నల్ శత్రువులు ఎక్స్‌టర్నల్ వాళ్ళకన్నా డేంజరస్ వీళ్ళకు మన వృత్తాంతమంతా తెలుసు, విధిలేక లొంగాలి. ఇక మెదడుకు లంచమిస్తేగాని ఉపయోగంలేదు. అలాగే వ్రాలిపడుకున్నా. లంచమిస్తేగానీ మెదడుకదలదు. మెదడు కదిలితే గానీ కలంనడువదు. కలంనడిస్తేగానీ కథపుట్టదు. మెదడుమీద చెప్పరాని కోపంవచ్చింది ఇదెంత మాయ మర్మాలుచేసి కలాన్ని వశపరచుకొందా అని. అయినా వేళమంచిదికాదు. మనం తగ్గాలి. టీ గుర్తుకొచ్చింది. 'అమ్మా' అంటూ తల అటు తిప్పాను వంటయింటివైపు. ఆశ్చర్యం! అమ్మ ప్రత్యక్షమైంది. ఆశతో చేతుల్లోచూచాను కప్పువుందేమోనని. "రెండురోజుల్నుంచి చెబుతున్నా పంచదార అయిపోతోందిరా అని. చెవినివేసుకుంటేనా! పంచదార వస్తేనే టీలూ, కాఫీలూ-లేకుంటే చక్కెరలేకుండానే తాగండి" అంటూ అభినయంచేస్తూ నిలబడింది అమ్మ. నాకు కొరడాతో కొట్టినట్లయింది. చొక్కాతొడిగి వానలోనే బయలుదేరా ప్రక్కనేవున్న కొట్టుకి.

ఒక రోజు కాజువల్ లీవు వేస్ట్. అటు వానలో తడవడమూను. కథకదల్లేదు. ఏదో మునిగిపోయిన వాడిలా బాధపడుతూ సంచి సైకిల్‌కు తగిలించి బైటపడ్డానా వానలో.

కాని మెదడుమాత్రం తనపంతుతాను పుచ్చుకుంది ఆరోజు...అన్యాయపుసొత్తు.